క్లుప్తంగా

నూతన ఫీడర్ ప్రారంభం



డిచ్‌పల్లి: మండలంలోని కొరట్‌పల్లి గ్రామంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్ బ్రేకర్‌లను ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కొరట్‌పల్లి, సుద్దులం గ్రామాలకు ఒకటే ఫీడర్ బ్రేకర్ ఉండటంతో ఏదైనా అంతరాయం కలిగినప్పుడు మరమ్మతులు చేయాల్సి వస్తే రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వచ్చేదన్నారు. దీంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే వారని పేర్కొన్నారు. నూతనంగా ఫీడర్ బ్రేకర్ ఏర్పాటుతో రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. అనంతరం ఎస్ఈ రవీందర్‌ను మాజీ ఉప సర్పంచ్ నవీన్‌రెడ్డి, వీడీసీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ డీఈ ఉత్తమ్ జాడే, ఏఈ రాజేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



నిజామాబాద్ సిటీ: నగరంలోని 15వ డివిజన్‌లో ఉన్న ఉర్దూ మీడియం స్కూల్ ప్రహరీ, అదనపు గదుల నిర్మాణానికి నుడా చైర్మన్ కేశ వేణు శనివారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ. 25లక్షలు మంజూరు చేశారని తెలిపారు. స్కూల్ అదనపు భవన నిర్మాణానికి ఈ నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లావణ్య, రత్నాకర్, వెంకటేశ్, ప్రీతం పాల్గొన్నారు.

పసుపు ఉత్పత్తిదారుల సంఘం సందర్శన



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌లో ఏర్పాటు చేసిన జేఎంకేపీఎం పసుపు ఉత్పత్తిదారుల సంఘాన్ని గుంటూరు జిల్లా దుగ్గిరాల, మున్నంగి, కొల్లిపర గ్రామ పసుపు రైతులు శనివారం సందర్శించారు. దుగ్గిరాల పసుపు మార్కెట్ నుంచి వచ్చిన పసుపు రైతులు ఈద శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, సతీశ్‌రెడ్డి, వంగా రెడ్డి ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ వల్ల పసుపు రైతులకు కలిగే లాభాలను డైరెక్టర్ సంతోష్‌రెడ్డి వారికి వివరించారు. డైరెక్టర్ పాట్కూరి తిరుపతిరెడ్డి, రైతులు శ్రీధర్ పాల్గొన్నారు.

పరామర్శ



సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డు ఎం నవీన్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ సూపరింటెండెంట్ లాబన్, గ్రేడ్-3 సెక్రటరీ మధుసూదన్, గురుదాస్‌రెడ్డి ఉన్నారు.

అర్గుల్‌లో..

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్, సికింద్రాపూర్ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ధర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, నట్ట భోజన్న, నాయకులు పుప్పాల శ్రీనివాస్, దీకొండ శ్రీనివాస్, కుంచాల రాజు, అక్బర్‌ఖాన్ ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి



డిచ్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డిచ్‌పల్లి మండల విద్యాధికారి ఈఎల్ఎన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఘన్‌పూర్‌లోని వందేమాతరం హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎంఈవో హాజరై క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిని స్కూల్ ప్రిన్సిపాల్ టీఎం విక్రాంత్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి



సభలో పాల్గొన్న మేయర్ నీతూకిరణ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, కార్పొరేటర్లు

- మేయర్ నీతూకిరణ్
- మున్సిపల్ నగర కమిషనర్ ఆధ్వర్యంలో పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు
- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, మాజీ ఎమ్మెల్యే బిగాల



మేయర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు



మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్ సిటీ: ఐదేళ్ల కాలంలో కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేశామని మేయర్ నీతూకిరణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం కార్పొరేటర్లకు కమిషనర్ దిలీప్‌కుమార్ ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా బిగ్గాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. మేయర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అర్బన్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగరాన్ని పార్టీలకు అతీతంగా అందరితో కలిసి అభివృద్ధి చేశామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా తన అనుభవాలను పంచుకున్నారు. మున్సిపల్ అధికారులు, కమిషనర్ దిలీప్‌కుమార్ మేయర్, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు.

గాంధీగంజ్‌కు 120 ఏళ్లు

ఇందూరుకు తలమానికం

- సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి పాలనలో నిర్మాణం



సుభాష్‌నగర్(నిజామాబాద్‌అర్బన్): గాంధీగంజ్ ఇందూరుకు తలమానికంగా నిలుస్తోంది. సుమారు 120 ఏళ్ల కిందే ఈ చారిత్రక కట్టడాన్ని నిర్మించారు. సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి 1905లో రెండు భారీ ముఖ ద్వారాల మధ్య టవర్ మీద గడియారం (క్లాక్ టవర్) ఏర్పాటు చేయించారు. ఆ రోజుల్లో గడియారం నగరమంతా కనిపించేది. దీనిలో సమయం చూసే మార్కెట్‌లో కార్యకలాపాలు కొనసాగేవి. కాలక్రమంలో గడియారం నిర్వహణను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం మూలనపడింది.

మహబూబ్ గంజ్ నుంచి గాంధీగంజ్ వరకు..

1905కు ముందే వ్యాపారులను జానకీబాయి ఆహ్వానించి స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఈ మార్కెట్‌ను మహబూబ్ గంజ్‌గా పిలిచేవారని, స్వాతంత్య్రం అనంతరం గాంధీగంజ్‌గా మార్చారని పూర్వీకులు చెబుతున్నారు. 1905 నుంచి 1980 వరకు ఇక్కడే మార్కెట్ కొనసాగింది. 29 జనవరి 1938 నుంచి నిజాం ప్రభుత్వ మార్కెటింగ్ చట్టం అమలైంది. బెల్లం, ఉల్లిగడ్డ, మొక్కజొన్న, పత్తి, మిర్చి, వరి ధాన్యం, వేరుశనగ, పసుపు, ఎల్లిగడ్డ, చింతపండుతో పాటు అన్నిరకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగేవి. పెరుగుతున్న జనాభాతోపాటు పొరుగు జిల్లాల నుంచి పంట దిగుబడులు వస్తుండడంతో 1970లో శ్రద్ధానంద్ గంజ్‌కు 68 ఎకరాలు కేటాయించారు. 1980 నుంచి శ్రద్ధానంద్ గంజ్‌లోనే మార్కెట్ కొనసాగుతోంది. చారిత్రక గాంధీగంజ్ ప్రస్తుతం వైభవం కోల్పోయి వెలవెలబోతోంది. క్రమంగా ఆనవాళ్లు కోల్పోతోంది. 1980 వరకు నడిచిన గడియారం.. మోగిన గంటలు పాలకుల నిర్లక్ష్యంతో కాలగర్భంలో కలిసిపోయాయి. 2004లో మెకానికల్ గడియారాన్ని ఎలక్ట్రానిక్ గడియారంగా మార్చారు. రూ.లక్ష వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. కానీ రెండు, మూడేళ్లలోనే వర్షానికి తడిసి చెడిపోయాయి. అప్పటి నుంచి గడియారం నిర్వహణను గాలికొదిలేయడంతో మరుగున పడింది. 2018లో గంజ్ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించినా ఆచరణకు నోచుకోలేదు. గంజ్‌లో గడియారం, గంట ఆనవాళ్లు లేకుండాపోయి కళాహీనంగా మారింది.

ప్రత్యేక ఆకర్షణగా గడియారం

శతాబ్దం క్రితమే గాంధీగంజ్‌లో మెకానికల్ గడియారం (క్లాక్ టవర్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టవర్‌కు నలువైపులా గడియారాలు ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేశారు. సమయం తెలిసేలా పెద్ద గంటను బిగించారు. అక్కడి సిబ్బంది ప్రతి గంటకోసారి ఎన్ని గంటలైతే అన్ని సార్లు గంటను మోగించేవారు. ధ్వని నగర నలుమూలలకు వినిపించేది.

అవినీతికి చిరునామా కేసీఆర్ కుటుంబం



డిచ్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నాయకులు

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం అవినీతికి చిరునామాగా నిలుస్తుందని, త్వరలోనే వారి చిరునామా ఎర్రగడ్డ అవుతుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి సర్వనాశనం చేశారని అన్నారు. రైతు ఆత్మహత్యలపై బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా నాలుగు గ్యారెంటీలను ఈ నెల 26నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడానికే ముందుగా ఇంటింటి సర్వే జరిపి అనంతరం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించామన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఇప్పుడు మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పలు అభివృద్ధి పనులకు సుమారు రూ.100 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ జీరో అవుతుందని భూపతిరెడ్డి జోస్యం చెప్పారు. రైతులకు అండగా నిలుస్తామని ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ రైతు కమిటీ కి రైతుల నుంచి స్పందన లేకపోవడంతో జక్రాన్‌పల్లి మండల కార్యక్రమాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చిందంటే ఆ పార్టీ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగేశ్ రెడ్డి, శేఖర్ గౌడ్, ముప్ప గంగారెడ్డి, శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, నవీన్ గౌడ్, ఎల్లయ్య, బాల్‌రాజ్, రవి, చిన్నారెడ్డి, కంచెట్టి గంగాధర్, చిన్నోల్ల నర్సయ్య, రాంచందర్‌గౌడ్, రామకృష్ణ, వాసు, షాదుల్లా, దేవకరుణ, రాజేశ్వర్, ధర్మగౌడ్, నర్సయ్య, ఇబ్రహీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడా రామ్‌మందిర్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి కృషి



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నగరంలోని బడా రామ్‌మందిర్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. శనివారం నగరంలోని గాజుల్‌పేట్‌లో ఉన్న బడా రామ్‌మందిర్ ఆలయం, గోశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. గోవులకు ఎలాంటి నష్టం జరగకపోవడం అదృష్టమన్నారు. అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి దేవాదాయశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి.. కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధ్యులను గుర్తించకపోవడం, పోలీస్‌శాఖకు ఫిర్యాదు చేయకపోవడంపై మండిపడ్డారు. ఆలయానికి ప్రహరీ, సెక్యూరిటీ లేకపోవడం వల్లే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ, స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాగోళ్ల లక్ష్మీనారాయణ, బట్టు రాఘవేందర్, అల్లాడి రాజు, బాలకృష్ణ, సుధాకర్, రమేశ్, దీపక్, వెంకటరాములు తదితరులు ఉన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మనదే

సుభాష్‌నగర్: ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం మనదేనని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం నగరంలోని కంఠేశ్వర్ మండలశాఖ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు హమారా సంవిధాన్ -హమారా స్వాభిమాన్ అనే నినాదంతో సంవిధాన్ గౌరవ అభియాన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అంబేడ్కర్ పుట్టుక నుంచి మరణం వరకు ఐదు ప్రదేశాలను గుర్తించి పంచతీర్థాల పేరుతో బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని అన్నారు. రామాయణం, మహాభారతం పవిత్ర గ్రంథాలతో సమానంగా రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని, కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ అంబేడ్కర్‌ను అవమానించాయని అన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌రావు, శివప్రసాద్, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కొండా ఆశన్న, మాయావర్ సాయిరాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బర్కత్‌పుర పాఠశాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: నగరంలో బర్కత్‌పురలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరిశీలించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పాఠశాలకు కావాల్సిన సదుపాయాలు కల్పించడంలో సహాయం చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట హెచ్‌ఎం కృపాల్ సింగ్, కార్పొరేటర్ బంటురాము తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

ఒకరిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు తెలిసింది. తన ఇంట్లోకి చొరబడ్డాడనే కారణంతో ఒకరిపై మరొకరు కత్తితో దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులను వివరణ కోరగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

బైక్ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోధన్ బస్టాండ్ వద్ద నుంచి బైక్ చోరీకి గురైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. షరీఫ్ అనే వ్యక్తి పని నిమిత్తం వచ్చి బస్టాండ్ వద్ద బైక్ నిలిపాడని, అతడు పని పూర్తి చేసుకొని తిరిగి వచ్చేసరికి దుండగుడు బైక్ ఎత్తుకెళ్లాడన్నారు. ఈనెల 8వ తేదీన బైక్ చోరీకాగా, బాధితుడు శనివారం ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

సిరికొండ: సిరికొండ జీపీ పరిధిలోని మహిపాల్ తండాకు చెందిన బాధితుడికి మంజూరైన రూ. ముప్పై వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రూప్ సింగ్, గ్రామస్తులు ఉన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పేర్కొన్నారు.

పిల్లల భద్రతపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



మోపాల్: పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగమణి సూచించారు. శనివారం మండలంలోని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లల భద్రత-తల్లిదండ్రుల పాత్ర అనే అంశంపై చర్చించారు. తల్లిదండ్రులు పిల్లల భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను నాగమణి వివరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు రాము, అనురాధ, వసంత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆటల పోటీలు



సిరికొండ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలను శనివారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సతీశ్‌గౌడ్ వారితో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద శ్రద్ధతో చదివేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ జన్మ ఎంతో గొప్పది



నిజామాబాద్ రూరల్: మానవ జన్మ ఎంతో గొప్పదని ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ మేఘ రాజ్ శర్మ అన్నారు. బస్వాగార్డెన్‌లో కొనసాగుతున్న శ్రీ శివ మహాపురాణ ప్రవచనం శనివారం ఐదోరోజుకు చేరింది. జన్మను సార్థకం చేసుకోవాలంటే ఆధ్యాత్మిక చింతన తప్ప వేరే మార్గం లేదన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

28న విలీన సభ

సిరికొండ: ఖమ్మంలో పీడీఎస్‌యూ రెండు రాష్ట్ర కార్యవర్గాల విలీన సభను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు మండల నాయకుడు రాజేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలలో విలీన సభ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వతేజ్, రితీశ్‌గౌడ్, రాము, అనిల్, సూర్య, వంశీ, అక్షయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అదనపు కలెక్టర్

సాక్షి నెట్‌వర్క్: సమాజంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని పలువురు అధికారులు అన్నారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని అధికారులు సూచించారు. పలుచోట్ల నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని షేక్ అమీనా విజేతగా నిలవడంతో కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అంకిత్ ప్రశంసాపత్రంతో పాటు మెమొంటోను అందజేశారు.



జక్రాన్‌పల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



సిరికొండలో..

పోస్టర్ల ఆవిష్కరణ



సిరికొండ: తూంపల్లి అడవుల్లో కొలువైన ఎదురుకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక ఉత్సవాల వాల్ పోస్టర్లను గ్రామంలో శనివారం గ్రామస్తులు ఆవిష్కరించారు. వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ లక్ష్మణ్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, బూస రాజు, విజయ్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	82,400	వెండి(కిలో)	95,700
22 క్యారెట్స్	76,035		

- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	50	80
జీరకాయ	40	80	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	20	40	కరివేపాకు	60	100
మెంతికూర	20	40	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.30, 4.30, 7.20, 10.00
- స్క్రీన్-2 ఐ డెంటిటీ(తెలుగు)-01.30; డాకు మహారాజు(తెలుగు)-4.30,10.20; గేమ్ ఛేంజర్(తెలుగు)-7.20
- స్క్రీన్-3 స్కైయ్ ఫోర్స్(హిందీ)- 11.00, 1.35, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-10.00, 1.00,4.00, 7.00, 10.00
- స్క్రీన్-2 స్కైయ్ ఫోర్స్(హిందీ)-10.50, 1.35, 7.25, 10.10; డాకు మహారాజు (తెలుగు)- 4.20
- స్క్రీన్-3 తొలిమనసు(తెలుగు)-11.05; గాంధీ తాత చెట్టు(తెలుగు)-2.10 8.00; గేమ్ ఛేంజర్(తెలుగు)- 4.40; హత్య(తెలుగు)-10.30
- స్క్రీన్-4 డియర్ కృష్ణ(తెలుగు)-11.00; ఐ డెంటిటీ(తెలుగు)-1.45; హాంగ్‌కాంగ్ వారియర్స్(తెలుగు)-5.00; డాకు మహారాజు(తెలుగు)-7.20; పుష్ప-02(తెలుగు)-10.25

- లలితామహల్ గేమ్ ఛేంజర్(తెలుగు)
- దేవి డాకు మహారాజు(తెలుగు)
- నటరాజ్ స్కైయ్ ఫోర్స్(హిందీ)
- విజయ్ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ



నిజామాబాద్ రూరల్: జిల్లాలో ఆటోమొబైల్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన ప్రకాశ్ హ్యుందాయ్ కార్ షోరూమ్‌లో శనివారం నూతన క్రె టా ఎలక్ట్రిక్ కారును జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎల్ రాజావెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం ఎండీ నల్ల స్రవంతిరెడ్డి, దినేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారులో అత్యధిక సాంకేతికత పరిజ్ఞానంతో కూడిన సరికొత్త 42 కేడబ్ల్యూహెచ్ 51.4 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం గల అల్టిమేట్ బ్యాటరీతో భద్రత సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ వినోద్, నితిన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.